



EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
గురువారం
28-08-2025
పేజీలు: 02



# మెదక్‌లో కుంభవృష్టి.. సీఎం రేవంత్ పర్యటన

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా.. వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. రాత్రిపగళ్ళు అని తేడా లేకుండా.. కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా పలు జిల్లాలు జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో వరద చేరడంతో.. ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయారు. వాగులు, నదులు పొంగిపోర్లుతున్నాయి. రహదారులపై భారీగా నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో రవాణా సౌకర్యాలు దెబ్బతిన్నాయి. రోడ్లు జలమయం కావడంతో పాటు రైళ్లు కూడా రద్దు అయ్యాయి. మెదక్ జిల్లాలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా 30.1 సెం.మీ వర్షపాతం నమోదైంది. హావేలిఘనాపూర్ మండలం సర్దనలో 30 సెంటీమీటర్ల కుండపోత వాన కురిసింది. నాగపూర్‌లో 27 సెం. మీ వర్షపాతం నమోదైంది. చేగుంటలో 22 సెం. మీ, రామయంపేట మండలాల్లో 20 సెం. మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. ఈ మేరకు మెదక్ నుంచి బోధన్, బాన్సువాడ వైపు బస్సు సర్వీసులు నిలిపివేసినట్లు అధికారులు ప్రకటించారు. రామాయంపేట మండలంలో వర్షం ధాటికి పలు కాలనీలు జలమయం అయ్యాయి. కాలనీలో చిక్కుకున్న ప్రజలను అధికారులు రక్షిస్తున్నారు.





## రాష్ట్రంలో భారీ వర్షాలు..

# పలు మార్గాల్లో రైళ్లు రద్దు

రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరదలకు పలు ప్రాంతాల్లో రైల్వే ట్రాకులు నీటమునగడంతోపాటు కొట్టుకుపోయాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన దక్షిణ మధ్య రైల్వే పలు రైళ్లను రద్దు చేసింది. మరికొన్ని రైళ్లను దారి మళ్లించగా, కొన్నింటిని పాక్షికంగా రద్దు చేసింది. అయితే వరదల దృష్ట్యా దారి మళ్లింపు రైళ్ల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.
గురువారం అకోల- అకోట, కాచిగూడ-నాగర్‌సోల్ మధ్య నడవాల్సిన రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా కాచిగూడ — కరీంనగర్, హెచ్.ఎస్ నాందేడ్ — మేడ్చల్ రైళ్లు రద్దయ్యాయి.
హైదరాబాద్-కామారెడ్డి మధ్య పలు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి.
భిక్కనూరు-తలమడ్ల, అక్కన్నపేట్-మెదక్ స్టేషన్ల మధ్య పట్టాలపై వర్షపు నీరు చేరింది. కరీంనగర్-కాచిగూడ, మెదక్- కాచిగూడ, బోధన్-కాచిగూడ, కాచిగూడ-మెదక్, నిజామాబాద్-తిరుపతి, ఆదిలాబాద్- తిరుపతి రైళ్లను అధికారులు రద్దు చేశారు. అదేవిధంగా శుక్రవారం కాచిగూడ — నర్కేర్ సర్వీస్‌ను రద్దు చేశామని వెల్లడించారు. గజ్వేల్ — లక్డారం మధ్య రైలు పట్టాలపై వరద నీరు భారీ ప్రహిస్తుండటంతో గురు, శుక్రవారాల్లో మల్కాజిగిరి- సిద్దిపేట సర్వీసు రద్దు చేసినట్లు తెలిపారు.





### భారీ వర్షాలపై కేసీఆర్ ఆందోళన..

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జనజీవనం అస్తవ్యస్తం కావడం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, వరంగల్ నుంచి ఖమ్మం దాకా పలు జిల్లాల్లో వరదలతో నివాసాలు నీట మునిగి, రోడ్లు తెగిపోయి రవాణా వ్యవస్థ అతలాకుతలమై, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావడం పట్ల తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వరద ప్రభావిత జిల్లాలకు చెందిన పార్టీ ముఖ్యనేతలకు అధినేత ఫోన్లు చేసి ఈ మేరకు అప్రమత్తం చేశారు. వరద బాధిత ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ వంతుగా సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ దిశగా పార్టీ శ్రేణులను అప్రమత్తం చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అధినేత కేసీఆర్ సూచించారు.





# అమీర్ పేట్‌లో భారీ అగ్ని ప్రమాదం

అమీర్ పేట్ లో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మెట్రో పిల్లర్ 1444 వద్ద ఉన్న బాలాజీ గీ స్టోర్ లో మంటలు చెలరేగాయి. దట్టమైన పొగతో పరిసరాలు నిండిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. షార్ట్ సర్క్యూట్ తోనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు. భారీగా ఆస్తి నష్టం జరిగినట్టు సమాచారం.

### బోయిన పల్లిలో పెట్రోల్ బంక్‌లో తప్పిన భారీ ప్రమాదం

బోయిన పల్లిలో పెట్రోల్ బంక్ లో భారీగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పెట్రోల్ బంక్ లో బైక్ లలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మంటల్లో పూర్తిగా రెండు బైకులు దగ్ధమయ్యాయి. పెట్రోల్ బంక్ సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకువచ్చాడు.


# సుందరకాండ రివ్యూ

టాలెంటెడ్ నటుడు నారా రోహిత్ హీరోగా దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి తెరకెక్కించిన లేటెస్ట్ చిత్రమే 'సుందరకాండ'. మేకర్స్ చాలా కాన్ఫిడెంట్ గా ఉన్న ఈ సినిమా ఎలా ఉందో రివ్యూలో చూద్దాం రండి. సిద్ధార్థ్ (నారా రోహిత్) తనకి కాబోయే భార్యకి కావాల్సిన ఐదు లక్షణాలు లేవని తనకి వచ్చిన పెళ్లి సంబంధాలు అన్నీ రిజెక్ట్ చేస్తూ వస్తాడు. ఇలా ఒకరోజు ఐరా (వ్రితి వఘని) తన లైఫ్ లో తాను కోరుకున్న లక్షణాలు కలిగిన ఓ కాలేజ్ అమ్మాయిగా తన లిస్ట్ లోకి యాడ్ అవుతుంది. అక్కడ నుంచి ఆమెకోసం తాను వెతకడం మొదలు పెడతాడు. అలా ఆమెతో ఏజ్ లో కొంచెం గ్యాప్ ఉన్నప్పటికీ తన ప్రపోజల్ ని పెడతాడు. మరి అక్కడ నుంచి కథ ఏమైంది? ఇంత కాలం తాను ఎందుకు సింగిల్ గానే ఉండాల్సి వచ్చింది? ఐరా తన ప్రపోజల్ ని ఏం చేసింది? ఈ కథలో వైష్ణవి (శ్రీదేవి విజయకుమార్) కి లింక్ ఏంటి అనేవి తెలియాలి అంటే ఈ సినిమా చూసి తెలుసుకోవాలి. మన టాలీవుడ్ లో ఉన్నటువంటి ఫైనెస్ట్ నటుల్లో నారా రోహిత్ కూడా ఒకరు. ఆ మాట ఈ సినిమాతో మరోసారి ప్రూవ్ అయ్యిందని చెప్పవచ్చు. తన సోలో సినిమా నుంచి మొన్న భైరవం వరకు చూసుకున్నా ఎలాంటి డ్షేడ్ ఉన్న రోల్ ని అయినా చాలా ఈజ్ గా తాను చేస్తారు. ఇప్పుడు సుందరకాండ లో కూడా ఒక లైట్ క్యారెక్టర్ ని కూడా అంతే ఈజ్ గా మంచి నటనతో ఆకట్టుకున్నారు. ముఖ్యంగా తన కామెడీ టైమింగ్ మరోసారి ఆకట్టుకుంటుంది. అలాగే ఎమోషనల్ పార్ట్ కూడా చాలా బాగుంది. సెకండాఫ్ లో తనపై ఎమోషనల్ సీన్స్ బాగున్నాయి. ఇక ఐరా గా కనిపించిన వ్రితి రోల్ సినిమాలో చాలా బాగుంది. ఆమె పాత్రని తీర్చిదిద్దిన విధానం కానీ అందులో ఆమె నటించిన తీరు బాగా ఇంప్రెస్ చేస్తాయి. తన కాన్ఫిడెన్స్, ఎమోషనల్ సన్నివేశాల్లో ఆమెలో పరిపక్వత కనిపిస్తుంది. డెఫినెట్ గా ఆమెకి మంచి ఫ్యూచర్ ఉంది. చాలా కాలం తర్వాత వెండితెరపై కనిపించిన నటి శ్రీదేవి విజయకుమార్ రోల్ కూడా సినిమాలో బాగుంది. కథలో తన రోల్ చూపించే ఇంపాక్ట్ బాగుంది. అందుకు తగ్గట్టుగానే ఆమె కూడా ఈ పాత్రని బాగా క్యారీ చేసి రక్తి కట్టించారు. అలాగే సినిమాలో కమెడియన్ సత్య మంచి ఎంటర్టైనర్ అని చెప్పవచ్చు. తన టైమింగ్ మరోసారి వర్కౌట్ అయ్యింది. తనతో పాటుగా వాసుకి ఆనంద్, సునైనా, అభినవ్ గోమటం తదితరులు బాగా చేశారు. ఈ సినిమా విషయంలో ఇంటర్వెల్ ట్విస్ట్ చాలా బాగుంటుంది అని సినిమాకే బిగ్ టర్న్ గా ఉంటుంది అని ముందే టాక్ వచ్చింది. నిజంగా అదే రీతిలో ఇంటర్వెల్ ట్విస్ట్ ఉందని చెప్పవచ్చు. ఒక జెన్యూన్ సర్ప్రైజ్ గా వచ్చి అక్కడ నుంచి సెకండాఫ్ మంచి ఎంగేజింగ్ గా సాగింది. ట్విస్ట్ రివీల్ చేసినప్పటికీ ఒక సస్పెన్స్ ఫ్యాక్టర్ ని అలానే ఆద్యంతం మైంటైన్ చేయడం అనేది మంచి విషయం. ఈ సినిమాలో సెటప్ అంతా మంచి ఎంగేజింగ్ గానే ఉన్నప్పటికీ కథ మాత్రం కొంచెం తెలిసినట్టే ఓ బాలీవుడ్ సినిమాని కూడా మరిపిస్తుంది. అలాగే ఇంటర్వెల్ తర్వాత కథనం ఎమోషనల్ పరంగా టచ్ మైంటైన్ చేస్తే బాగుణ్ణు కానీ దర్శకుడు కామెడీ పరంగా తీసుకెళ్లారు. ఇంకా కొన్ని సన్నివేశాలు ఒకింత ఓవర్ గా అనిపిస్తాయి. అలాగే కొన్ని మూమెంట్స్ కూడా ఏదో క్లాస్ లా అనిపిస్తాయి. ఇక నటుడు నరేష్, అభినవ్ లాంటి వారిని పెద్దగా వినియోగించుకోలేదు అనిపిస్తుంది. వారిపై కామెడీ సీన్స్ ఇంకా పెట్టి ఉంటే బాగుండు. ఈ చిత్రంలో నిర్మాణ విలువలు చాలా బాగున్నాయి. సినిమాకి తగ్గట్టుగా సెటప్ చేసుకున్న ప్రొడక్షన్ డిజైన్ కూడా చాలా నీట్ గా ఉంది. అలాగే ప్రదీష్ వర్మ కెమెరా వర్క్ చాలా బాగుంది. లియోన్ జేమ్స్ సంగీతం మాత్రం బిగ్ ప్లస్ అని చెప్పవచ్చు. పాటలు, తన స్కోర్ సినిమాలో చాలా ప్లస్ అయ్యాయి. రోహన్ చిల్లలే ఎడిటింగ్ ఇంకొంచెం బెటర్ గా చేయాల్సింది. ఇక దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి విషయానికి వస్తే.. తాను తన మొదటి సినిమాకే సాలిడ్ వర్క్ అందించారు అని చెప్పవచ్చు. ముఖ్యంగా తన బ్యాలెన్స్డ్ కథనం సినిమాలో ఇంప్రెస్ చేస్తుంది. పాత్రలు డిజైన్ చేసుకున్న విధానం కానీ వాటిని తీసుకెళ్లిన తీరు,
ట్విస్ట్ లు లాంటివి తన విజన్ ని చూపిస్తాయి. ఫ్యూచర్ లో తన నుంచే ఇదే రీతిలో మైంటైన్ అయితే మంచి భవిష్యత్తు ఉంటుంది. ఇక మొత్తంగా చూసుకున్నట్టయితే ఈ 'సుందరకాండ' ఒక డీసెంట్ ఎంటర్టైనర్ అని చెప్పవచ్చు. ఒక క్లీన్ రోమ్ కామ్ ఎంటర్టైనర్స్ ని చూడాలి అనుకునేవారికి ఈ వీకెండ్ లో మంచి ఛాయిస్ గా ఈ సినిమా నిలుస్తుంది. నారా రోహిత్ ఇంప్రెసివ్ నటన, ఇతర నటీనటుల పెర్ఫమెన్స్ లు బాగున్నాయి. అయితే కొన్ని మూమెంట్స్ మాత్రం డల్ గా అనిపిస్తాయి కానీ వీటిని పక్కన పెడితే ఈ చిత్రం ఎంటర్టైన్ చేస్తుంది.



సూర్య EVENING 4PM EDITION
www.suryaa.com

# VINAYAKA CHAVITHI SPECIAL MOVIE POSTERS






























# శ్రీరామ సాగర్ ప్రాజెక్టుకు పోటెత్తిన వరద

ఎగువన గల మహారాష్ట్రలో భారీ వర్షాలు కువడంతో శ్రీరామ సాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతోంది. నిర్మల్, నిజామాబాద్ జిల్లాలలో భారీగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి 2 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట 39 గేట్లను ఎత్తి దిగువకు 2లక్షల 50 వేల క్యూసెక్కుల నీటిని అధికారులు వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091అడుగులు 80.5 టిఎంసిలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1087.30 అడుగులు 67.332 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు ప్రదాన కాల్వలు ఇందిరమ్మ వరద కాలువ ద్వారా 17,300 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 8000 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 400 క్యూసెకుల నీటిని విడుదల చేస్తున్నామని ప్రాజెక్టు ఎఇఇ రవి తెలిపారు.



దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

శ్రీరామ సాగర్ ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో గోదావరి నది పరిసర ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. పశువుల కాపరులు చేపలు పట్టేవారు రైతులు ప్రజలు గోదావరి నది వైపు వెళ్ళవద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు.

కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో రికార్డు స్థాయిలో కురిసిన కుండపోత వర్షాలు

తెలంగాణలోని కామారెడ్డి, మెదక్ జిల్లాలను అసాధారణ వర్షాలు ముంచెత్తాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వానలతో ఈ జిల్లాలు అతలాకుతలమయ్యాయి. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కొన్ని ప్రాంతాల్లో కేవలం కొన్ని గంటల్లోనే 40 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదవడంతో పట్టణాలు, గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈ భారీ వర్షాల కారణంగా జనజీవనం పూర్తిగా స్తంభించిపోగా, ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర సమీక్ష నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. కామారెడ్డి జిల్లాలోని రాజాంపేటలో బుధవారం ఉదయం 8:30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య రికార్డు స్థాయిలో 41.83 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇదే జిల్లాలోని కామారెడ్డి పట్టణంలో 28 సెం.మీ., భిక్నూర్‌లో 23.8 సెం.మీ. వర్షం కురిసింది. మెదక్ జిల్లా హవేలిఘన్‌పూర్‌లో 26.13 సెం.మీ. వర్షపాతం నమోదైంది. గత 24 గంటల్లో ఈ రెండు జిల్లాల్లో 30 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైనట్లు విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ వెల్లడించారు. ఈ అసాధారణ వర్షాల ధాటికి వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లి వరద నీరు ఊళ్లలోకి ప్రవేశించింది.భారీ వరదల కారణంగా హైదరాబాద్-నిజామాబాద్ మధ్య రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. మెదక్ జిల్లా నర్సింగి వద్ద 44వ నంబరు జాతీయ రహదారిపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో అధికారులు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దీంతో వందలాది వాహనాలు కిలోమీటర్ల కొద్దీ నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు, హైదరాబాద్ డివిజన్ పరిధిలోని భిక్నూర్-తల్మడ్ల, ఆకన్‌పేట-మెదక్ సెక్షన్ల మధ్య రైల్వే ట్రాకులు నీట మునగడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దక్షిణ మధ్య రైల్వే పలు రైళ్లను రద్దు చేయగా, మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేసి, ఇంకొన్నింటిని దారి మళ్లించింది.ఈ ప్రకృతి విపత్తులో విషాద ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. కామారెడ్డి జిల్లాలో ఓ ఇంటి గోడ కూలి వినయ్ అనే వైద్యుడు మృతి చెందారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట సమీపంలోని ఎగువ మానేరులో పశువులను మేపడానికి వెళ్లిన ఐదుగురు వ్యక్తులు వరదల్లో చిక్కుకోగా, మరో రైతు గల్లంతయ్యారు. వరదల్లో చిక్కుకున్న వారిలో ఒకరితో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఫోన్‌లో మాట్లాడి, వారిని రక్షించేందుకు అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

# ఇల్లీగల్ బిల్డింగ్ కూలి 15 మంది మృతి

మహారాష్ట్రలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పాల్ఘర్ జిల్లాలోని విరార్ ప్రాంతంలో గల ఓ భవనం కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయారు. బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ భవనాన్ని అనధికారికంగా నిర్మించినట్లు అధికారులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. భారీ యంత్రాలతో శిథిలాలను తొలగిస్తున్నారు. ఈ భవనం కూలడంతో అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వారందరినీ చందన్సార్ సమాజమందిర్‌కు తరలించినట్లు జిల్లా కలెక్టర్ ఇందూ రాణి జఖర్ తెలిపారు. నిరాశ్రయులకు ఆహారం, నీరు, వైద్య సహాయం అందించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఘటనాస్థలి వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు ఈ ఘటనలో భవనం యజమాని నితల్ గోపీనాథ్ సానేపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన ఆయన్ని పోలీసులు అరెస్టు చేశారు.





# కామారెడ్డి వరద సహాయక చర్యల్లో కొత్వాల్

కామారెడ్డి జిల్లాను వరద ముంచెత్తడంతో పోలీస్ శాఖ అప్రమత్తం అయింది. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సహాయక చర్యల కోసం స్వయంగా రంగంలోకి దిగారు. అర్ధ రాత్రి దాక ఆయన జాతీయ రహదారి మీదే పహారా చేశారు. బిక్కనూర్ మండలం జంగంపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై నుండి వరద నీరు ఎక్కువగా ప్రవహించడం వలన రాకపోకలు పూర్తిగా నిలిపి వేశారు. అసలే జాతీయ రహదారి కావడంతో దాదాపు ఆరుగంటల పాటు వాహనాలను నిలిపి వేయడంతో దాదాపు పది కిలో మీటర్ల మేరకు ఆయా రాష్ట్రాలకు వెళ్లే భారీ వాహనాలు ఇరువైపుల నిలిచి పోయాయి. కమిషనర్ సాయి చైతన్య రంగంలోకి దిగి జాతీయ రహదారి మీద వరద నీరు రాకుండా నియంత్రించడంతో పాటు వాహనాల రాకపోకలను పున ప్రారంభించారు. ఒక వైపు నుంచే వాహనాలు వెళ్లేలా చేశారు . ఈ సందర్భంగా వాహనదారులు కాస్త సమయన్వయం పాటించాలని వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందువలన సంబంధిత పోలీసు వారికి సహకరించాలన్నారు. భారీ వర్షంలోనే ఆయన కామారెడ్డి ఎస్పీ అదనపు కమిషనర్ బస్వా రెడ్డి లతో కలిసి వాహనాల రాకపోకలు క్లియర్ చేయడంతో వాహన దారులు వారిని ప్రశంసించడంతో పోలీసుల సేవలను కొనియాడారు. వర్షానికి కూడా లెక్కచేయకుండా విధులు నిర్వహించి తమ గమ్యానికి చేరే విధంగా కృషి చేసారంటూ కితాబు ఇచ్చారు.

# రేవంత్ రెడ్డి గెటప్‌లో వినాయకుడి విగ్రహం

హైదరాబాద్ — గోషామహల్ నియోజకవర్గం అఘాపూరలో రేవంత్ రెడ్డి గెటప్‌లో ఉన్న వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేసిన ఫిషరీస్ కమిటీ చైర్మన్ మెట్టు సాయి కుమార్

